క్లుప్తంగా

వ్యాసరచన పోటీల్లో కె.కోట విద్యార్థి ఎంపిక



గీతాన్వితకు ప్రశంసా పత్రం అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

కామవరపుకోట: ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం వ్యాసరచన పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో ఎంపికైన ద్వారకాతిరుమల గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని కామవరపుకోటకు చెందిన పాలిమెట్ల గీతాన్వితకు ఏలూరులో మంగళవారం జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి బహుమతితో పాటు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థిని గీతాన్వితను అభినందించారు.

హనుమంతరావుకి పురస్కారం



మంత్రి మనోహర్ నుంచి పురస్కారం అందుకుంటున్న హనుమంతరావు

కొయ్యలగూడెం: వినియోగదారుల దినోత్సవ సందర్భంగా 24వ తేదీ విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వం తనకు పురస్కారం అందించిందని రాష్ట్ర కన్స్యూమర్ ఫోరం ఉపాధ్యక్షుడు ఏఆర్కే హనుమంతరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు అందిస్తున్న సేవలకుగానూ ప్రభుత్వం తనను పురస్కారంతో గౌరవించిందన్నారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై మినిస్టర్ నాదెళ్ల మనోహర్ నుంచి పురస్కారం అందుకున్నట్లు ఆయన తెలిపారు.

న్యూడెమోక్రసీ ఐక్యత సభను జయప్రదం చేయాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

బుట్టాయగూడెం: ఈ నెల 28వ తేదీన హైదరాబాద్‌లో జరిగే న్యూడెమోక్రసీ ఐక్యత సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు ధర్ముల సురేష్ కోరారు. బుధవారం బుట్టాయగూడెంలో సభకు సంబంధించిన గోడ పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కారం రాఘవ, ఐఎఫ్‌టీయూ నాయకులు ఎస్.రామ్మోహన్, పీవైఎల్ నాయకులు తగరం బాబూరావు, కట్టం నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత నాగమణికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేరువేరుగా బుధవారం రూ.1,51,232 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా తాడేపల్లిగూడేనికి చెందిన కొవ్వూరి నాగమణి రూ.1,01,116, గతంలో ద్వారకాతిరుమల మండలం ఎంపీడీవోగా పని చేసి, ప్రస్తుతం సొంత జిల్లా శ్రీకాకుళంలో విధులు నిర్వర్తిస్తున్న రఘుపాత్రుని తిరుపతిరావు రూ.50,116 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు విరాళం బాండ్ పత్రాలను అందించి, స్వామి వారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

కోటదిబ్బ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రాజ్‌కృష్ణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎ.రాజ్‌కృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేసిన ధనుంజయరావు గత జూన్‌లో పదవీ విరమణ చేయగా అప్పటి నుంచి కళాశాల ఇంగ్లిష్ అధ్యాపకుడు విశ్వనాథ్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. కాగా బుధవారం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజ్‌కృష్ణ ఇప్పటివరకు తణుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు.

నేడు సామాజిక సర్వేపై గ్రామ సభ

దెందులూరు: దెందులూరులో గురువారం సాయంత్రం మూడు గంటలకు జాతీయ ఉపాధి హామీ పథకంపై సామాజిక సర్వేపై గ్రామ సభ నిర్వహిస్తామని ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు ఫాతిమా శ్రావణ్ బుధవారం తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామస్తులు సోషల్ ఆడిట్ గ్రామసభ హాజరు కావాలని వారు కోరారు.

ట్రాఫిక్ సమస్యకు మాస్టర్ ప్లాన్‌తో చెక్

- నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేసినా అభివృద్ధి శూన్యం
- మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని కోరుతున్న ప్రజలు



నగర పంచాయతీగా మార్పు చెందిన చింతలపూడి పట్టణం ఏరియల్ వ్యూ



చింతలపూడి బోసుబొమ్మ సెంటర్‌లో విపరీతంగా పెరిగిన ట్రాఫిక్

చింతలపూడి : నగర పంచాయతీగా మార్పు చెందిన చింతలపూడి పట్టణంలో మాస్టర్ ప్లాన్‌ను పటిష్టంగా అమలు చేయాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. మాస్టర్ ప్లాన్‌ను అమలు చేసినట్లయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందంటున్నారు. సాధారణంగా పెద్ద పెద్ద పట్టణాలకే మాస్టర్ ప్లాన్‌ను అమలు చేస్తుంటారు. అయితే భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 1983లోనే డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ చింతలపూడి మాస్టర్ ప్లాన్‌ను రూపొందించింది. ఈ మాస్టర్ ప్లాన్ ప్రకారం పట్టణం చుట్టూ 80 అడుగుల రింగు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. ఇప్పుడు నగరపంచాయతీగా కూడ అప్‌గ్రేడ్ చేయడంతో మాస్టర్ ప్లాన్ అంశం తెరపైకి వచ్చింది. అంతే కాక చింతలపూడికి 5 కిలోమీటర్ల దూరం నుండి గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణం చేపడుతున్నారు. ఈ జాతీయ రహదారి పూర్తయితే ఈ పట్టణం మీదుగా తెలంగాణ, మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సా రాష్ట్రాలకు రవాణా వాహనాల రద్దీ పెరిగే అవకాశం ఉంది. 2025 చివరి నాటికి ఈ రహదారి నిర్మాణం పూర్తి చేసే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉంది.

మాస్టర్ ప్లాన్ వల్ల ఉపయోగాలు

ఇదిలా ఉండగా పట్టణంలో మాస్టర్ ప్లాన్‌ను పటిష్టంగా కనుక అమలు చేస్తే ఎటువంటి నిర్మాణాలైనా ప్రణాళికాబద్ధంగా జరగాల్సిందే. పక్కా డ్రెయిన్ల నిర్మాణంతో పాటు, రోడ్లు, పార్కులు, టెలిఫోన్ కేబుల్ నిర్మాణాలు, మంచినీటి పైపులైన్ల నిర్మాణాలు పక్కా ప్రణాళికతో జరుగుతాయి. దీంతో పాటు పరిశ్రమలు, రియల్ ఎస్టేట్, ఇతర వాణిజ్య రంగాలకు కూడా మాస్టర్ ప్లాన్ వల్ల ఎన్నో ఉపయోగాలు ఉంటాయి. పంచాయతీ పరిధిలో కొత్తగా నిర్మాణం జరిగే గృహాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, అపార్ట్‌మెంట్లు మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగానే చేపట్టాలి. అయితే ఇంత వరకు నగర పంచాయతీ అధికారులు మాస్టర్ ప్లాన్‌ను అమలు చేసింది ఎక్కడా కనిపించడం లేదు. రోజురోజుకూ పట్టణం విస్తరిస్తోంది. పట్టణ జనాభా 40 వేలకు చేరువవుతుంది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు సరిహద్దులో ఉండటం కారణంగా చింతలపూడి మీదుగా వాహనాల రాకపోకలు గతంతో పోల్చుకుంటే విపరీతంగా పెరిగాయి. ఈ పరిస్థితుల్లో మాస్టర్ ప్లాన్‌ను కనుక అమలు చేస్తే పట్టణంలో రోడ్డు విస్తరణ అవసరం కూడా ఉండదని పలువురు సూచిస్తున్నారు.

మాస్టర్ ప్లాన్‌ను తక్షణం అమలు చేయాలి



చింతలపూడి పంచాయతీలో మాస్టర్ ప్లాన్‌ను తక్షణం అమలు చేయాలి. మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయకపోవడంతో ఇష్టానుసారంగా భవనాలు నిర్మిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులైతే నిబంధనలను అస్సలు పాటించడం లేదు.

–ఎం.వసంతరావు, సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి

మాస్టర్ ప్లాన్‌తో నిర్మాణాలు చేపట్టాలి



నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయిన చింతలపూడి పట్టణంలో మాస్టర్ ప్లాన్‌ను అమల్లోకి తీసుకు రావాలి. ఇకపై జరిగే నిర్మాణాలకు ఇందుకు అనుగుణంగా అనుమతులు ఇవ్వాలి. భవిష్యత్ తరాల అవసరాలకు మాస్టర్ ప్లాన్ అమలు అత్యవసరం.

–పిడపర్తి ముత్తారెడ్డి, జిల్లా పౌర హక్కుల సంఘం ఉపాధ్యక్షుడు

నేడు వైఎస్సార్‌సీపీ మండల కమిటీ సమావేశం

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ మండల కమిటీ సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు టౌన్ కన్వీనర్ శంకు కొండ పేర్కొన్నారు. మంతెన సోమరాజు గెస్ట్‌హౌస్ వద్ద ఉదయం పది గంటలకు సమావేశం నిర్వహించి 27వ తేదీ విద్యుత్ చార్జీలకు నిరసనగా చేపట్టబోయే పోరుబాట కార్యక్రమంపై నాయకులు దిశా నిర్దేశం చేస్తారన్నారు. ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు క్రియాశీలక కార్యకర్తలు హాజరు కావాల్సిందిగా కోరారు.

పారిజాతగిరిలో ధనుర్మాసోత్సవాలు



జంగారెడ్డిగూడెం: గోదాదేవి అనుగ్రహించిన తిరుప్పావై పాశురాల్లో వేద జ్ఞానం ఇమిడి ఉందని గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు తెలిపారు. శ్రీరంగనాథుడి అనుగ్రహం కోసం గోదాదేవి అందించిన తిరుప్పావై 30 పాశురాలలో వేదాలు, ఇతిహాసాలు, పురాణాల్లో పేర్కొన్న పలు అంశాలు సరళంగా ఉన్నాయని తెలిపారు. ధనుర్మాస వ్రత సందర్భంగా పదో రోజు పారిజాత గిరి ఆలయంలో గోదాదేవికి శ్రీకృష్ణుడికి విశేష పూజలు నిర్వహించారు. ఈవో రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మనుస్మృతి పత్రాల దహనం



మనుస్మృతి పత్రాలను దహనం చేస్తున్న మాల మహానాడు నాయకులు

జంగారెడ్డిగూడెం: స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు తొర్లపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం మనుస్మృతి పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ ముస్లిం మైనారిటీ వర్గాలు ఇప్పటికీ అట్టడుగున దిక్కుతోచని స్థితిలో ఉండటానికి ఈ మనుస్మృతి కారణమని ఆ నాడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ బహిరంగంగా మనుస్మృతి పత్రాలను దహనం చేశారన్నారు. అదే బాటలో మాల మహానాడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర నాయకులు కలపాల రాజకుమార్, బ్యాటరీ నాగు, కోట్నీస్, మహిళా అధ్యక్షురాలు ఎండీ సలీమా, మాల మహానాడు టౌన్ ప్రెసిడెంట్ వెంపల రాజు, రాణి, ధర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చెస్ పోటీలు



బహుమతులు అందుకున్న విజేతలు

జంగారెడ్డిగూడెం: మాస్టర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ స్టేట్ రాపిడ్ అండ్ చెస్ పోటీలు బుధవారం ముగిశాయి. స్థానిక చిట్టూరి గణేశ్వర టౌన్‌హాల్‌లో ఈ పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రా చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్ సీహెచ్ వర్మ విజేతలను అభినందించారు. విజేతలతో పాటు, పాల్గొన్న చెస్ క్రీడాకారులకు నగదు, ప్రశంసా పత్రాలను, మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో సిటీకేబుల్ ఎండీ చిన్ని హరీష్ గుప్త, టౌన్‌హాల్ ప్రెసిడెంట్ సచివరపు బుల్లి బుల్లయ్య, మద్దిపాటి నాగేశ్వరరావు, అలుగు ఆనందశేఖర్, రిటైర్డ్ ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ ఎస్.రాధాకృష్ణ, మాస్టర్‌చెస్ అకాడమీ కార్యదర్శి ఎస్ఎస్ చంద్రశేఖర్, డిస్ట్రిక్ట్ కన్వీనర్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

1300 మందికి అన్నప్రసాద వితరణ



అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ అన్నప్రసాద వితరణ కమిటీ వారిచే స్వామి వారి సన్నిధిలో బుధవారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. సుమారుగా 1300 మంది స్వామి వారి భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ అన్నదాన కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కానూరి గంగాధరరావు, చల్లా వరప్రసాద్, కొమ్మసాని రవీందర్ రెడ్డి, శీధరాల శ్రీనివాస వెంకట గంగాధర్, చెన్నూరి శివాజీ కృష్ణ, గారపాటి రాంప్రసాద్, రెడ్డి సాయి శ్రీరామ్, శీలి ఉమామహేశ్వరి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పోరుబాటను విజయవంతం చేయండి



పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జంగారెడ్డిగూడెం: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెంలో వైఎస్సార్‌సీపీ పోరుబాట పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి జెట్టి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెట్టి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్తు వినియోగదారులపై 15,486 వేల కోట్ల భారాన్ని మోపిందన్నారు. ఎన్నికల హామీల్లో విద్యుత్ పెంచబోమని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇలా ప్రజలపై మోపుతున్న భారాలను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ పోరాడుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 27వ తేదీన పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి శ్రీను, బత్తిన చిన్న, గురజాల పార్థసారథి, కౌన్సిలర్ నేకూరి కిషోర్, చిప్పాడ వెంకన్న, పళ్ల వెంకట రమణ, మైనార్టీ నాయకులు షేక్ అక్బర్, షేక్ అమీర్, మహమ్మద్ కబీర్, షేక్ జహీర్, వీరవల్లి సోమేశ్వరరావు, దున్న శివ, కంచిమర్తి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాజ్‌పేయి జయంతి



జంగారెడ్డిగూడెం: వాజ్‌పేయి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



కొయ్యలగూడెం: వాజ్‌పాయ్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు



పోలవరం రూరల్: వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు అధ్యక్షతన పట్టణ మున్సిపల్ పార్క్ సమీపంలో ఉన్న వాజ్‌పేయి చౌరస్తా వద్ద ఆయన విగ్రహానికి కొప్పాక శ్రీనివాసరావు, అర్జుల మురళి, యేసు వరప్రసాద్, నంబూరి రాజు, మేక ఈశ్వరయ్య, వేమూరి శ్రీనివాస్ తదితరులు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. మల్లాది సీతారామారావు, వేమూరి శ్రీనివాస్, బుచ్చియాచారి, తదితరులు పాల్గొన్నారు.

పోలవరం రూరల్: మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా పోలవరం మండలంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోలవరం, నూతన గూడెం, దేవరగొంది, ఎల్ఎన్‌డీపేట, రేపల్లెవాడ, గూటాల, పట్టిసీమ ప్రాంతాల్లో బీజేపీ శ్రేణులు వాజ్‌పేయి చిత్రపటం వద్ద ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గ్రంధి బాలకృష్ణ, బొరగం వెంకటలక్ష్మి, కరిబండి నాగరాజు, అల్లాడి ఈశ్వరరావు, దేవాబత్తుల వెంకటేశ్వరరావు, కామిశెట్టి పాపారావు, బొరగం పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: స్వర్గీయ మాజీ ప్రధాని వాజ్‌పాయ్ జయంతి కార్యక్రమం కన్నాపురం రోడ్ లో టౌన్ అధ్యక్షుడు బలిశెట్టి వాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నిర్మల కిషోర్ హాజరయ్యారు. జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు ఎస్ఆర్ఆర్ సుభద్ర దేవి, కట్టా సత్యనారాయణ, బొమ్మ బాబు, చిటికెన రమేష్, వి.నివాస్, ఆరేటి ఏసుబాబు, గొలిశెట్టి శ్రీను, మద్దిబోయిన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

30న జ్ఞాన సరస్వతికి ప్రత్యేక పూజలు



జ్ఞాన సరస్వతి అమ్మవారు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెంలో వేంచేసియున్న శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి వారి దేవస్థానంలో ఉపాలయమైన శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారికి మూలా నక్షత్రం సందర్భంగా ఈ నెల 30న ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి పంచామృత అభిషేకాలు, వివిధ రకాల పూజా సేవలు నిర్వహిస్తామని, సాయంత్రం ఆరు గంటలకు భక్తులచే లలిత సహస్రనామం నిర్వహిస్తామన్నారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



అయ్యప్పస్వామి

జంగారెడ్డిగూడెం: మండలంలోని గురవాయిగూడెం గ్రామంలో వేంచేసియున్న శ్రీహరిహరసుత అయ్యప్ప స్వామి వారి దేవస్థానంలో బుధవారం స్వామి వారికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జూదరుల అరెస్టు

జంగారెడ్డిగూడెం: పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు అక్కంపేటలో దాడి నిర్వహించామన్నారు. ఈ దాడిలో రూ.3300 నగదు స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మరియ తనయ.. సహృదయ

అంబరాన్నంటిన క్రిస్మస్ సంబరాలు



బుట్టాయగూడెం: క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



కామవరపుకోట: క్రీస్తు జన్మదిన విశిష్టతను వివరిస్తున్న పాస్టర్



పోలవరం రూరల్: చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు



చింతలపూడి: బోయగూడెం సెయింట్‌పాల్ చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం



ద్వారకాతిరుమల: పల్లకీ సేవలో బాల ఏసుతో ప్రత్యేకాలంకరణలో మరియమ్మ

ద్వారకాతిరుమల: మరియ తనయుడు బాల ఏసును పల్లకీలో ఉంచి మహిళలే స్వయంగా మోస్తూ క్రిస్మస్ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఎక్కడా లేని విధంగా క్రిస్మస్ పండుగ రోజున మహిళలు ఇలా పల్లకీ వాహనాన్ని మోస్తూ ప్రభువుకు సేవ చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. క్రీస్తు గొప్పతనాన్ని వివరిస్తూ ఫాదర్ ఈత కోట జీవరత్నం ఈ ఊరేగింపును నిర్వహించారు. ఊరేగింపులో పలువురు చిన్నారులు వేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

భక్తి, శ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

చింతలపూడి: మండలంలోని పలు క్రైస్తవ దేవాలయాల్లో ఏసు క్రీస్తు జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో మంగళవారం రాత్రి నుంచే క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. క్రిస్మస్ పండుగ సందర్భంగా పలు చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. బోయగూడెం ఆర్‌సీఎం చర్చ్ ఫాదర్ మాధ్యూకామా ప్రార్థనలు చేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

కామవరపుకోట: మండలంలో సంఘ విశ్వాసులు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు ప్రార్థనా మందిరాల్లో కేక్ కట్ చేసి ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. విశ్వాసులు ఆలపించిన ఏసుక్రీస్తు భక్తి గీతాలతో, పిల్లలు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో సంఘ విశ్వాసులు, సిస్టర్లు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

బుట్టాయగూడెం: ఏసుక్రీస్తు ప్రేమ, మార్గం సమస్త మానవాళికి అనుసరణీయమని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని దుద్దుకూరులో బుధవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చిన్నారులు అలరించిన క్రైస్తవ గీతాలు, నృత్యాలు, క్రీస్తు పుట్టుక నాటికలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

పోలవరం రూరల్: క్రిస్మస్ వేడుకలు మండల వ్యాప్తంగా క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా చర్చిలను సుందరంగా అలంకరించి, బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దైవ సేవకురాలు ఎలిపే పరంజ్యోతి, పిల్లి అనూష, షైనీ ఆరోన్, ఎస్తేరమ్మ, సంజీవరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు

జంగారెడ్డిగూడెం: పట్టణ, మండలంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జంగారెడ్డిగూడెంలో సీఎస్ఐ, ఆర్‌సీఎం చర్చిలతో పాటు వివిధ సంగస్తుల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

యుగకర్త ఏసుక్రీస్తు



కుక్కునూరు: లూథరన్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఎస్సై రామకృష్ణ

కుక్కునూరు: సర్వ మానవాళికి శాంతి సందేశాన్నిచ్చిన యుగకర్త ఏసుక్రీస్తని కుక్కునూరు సీఐ రమేష్‌బాబు అన్నారు. మండలంలోని పలు ప్రార్థన మందిరాల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుక్కునూరు లూథరన్ చర్చ్‌లో జరిగిన వేడుకల్లో కుక్కునూరు సీఐ, ఎస్సైలు పాల్గొని కేక్ కట్ చేశారు. క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు పాల్‌రాజు, దార సంజీవరావు, పోతురాజు, మోషేయ్య, గరటం హరీష్, తదితరులు పాల్గొన్నారు.